క్లుప్తంగా

మంచిరెడ్డిని కలిసిన డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్ సత్తయ్య



మాజీ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సత్తయ్య

తుర్కయంజాల్: బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య కలిశారు. తనకు అవకాశం కల్పించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ కందాడ లక్ష్మారెడ్డి, బ్యాంకు డైరెక్టర్ సామ సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ పూజ



నుచ్చుగుట్ట తండాలో పూజలో పాల్గొన్న స్వాములు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని నుచ్చుగుట్ట తండాలో మంగళవారం నేనావత్ పతన్ స్వామి నివాసంలో హనుమాన్ పడిపూజ ఘనంగా నిర్వహించారు. హనుమాన్ యజ్ఞం అనంతరం పడిపూజ నిర్వహించారు. అనంతరం హనుమాన్ స్వాములకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, రవిస్వామి, చందుస్వామి, దోశ్యానాయక్, బద్దునాయక్, నరేందర్, నర్సింహా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



వేంకటేశ్వరస్వామి దేవాలయంలో తిరుప్పావై ప్రబంధ విన్నపంలో భక్తులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం గోదా రంగనాద తులసీదళ అర్చన, తిరుప్పావై ప్రబంధ విన్నపం, నక్షత్రహారతి నిర్వహించారు. ఉత్సవాలలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించాలని వినతి

అబ్దుల్లాపూర్‌మెట్: చేనేత సహకార సంఘాల ఎన్నికలను తక్షణమే నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పద్మశాలి సంక్షేమ సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గుర్రం సురేందర్ ప్రజాదర్బార్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ పదేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేస్తున్నారని వినతి పత్రంలో ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు భద్రతతో కూడిన వృత్తి, ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు.

పర్వతాలు యాదవ్‌ను ఆదుకుంటాం

- బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: ఊదరి పర్వతాలు యాదవ్‌ను అన్ని విధాలుగా ఆదుకుంటామని బీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన ఊదరి పర్వతాలు యాదవ్ అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం శ్రీనివాస్‌యాదవ్ ఆసుపత్రికి వెళ్లి పర్వతాలు యాదవ్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, శివరాజు, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నేతలు

బడంగ్‌పేట్: కాంగ్రెస్ యువజన జాతీయ అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి పిలుపు మేరకు ఈ నెల 20న తలపెట్టిన సంసాద్ ఘెరావ్ పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి బడంగ్‌పేట కార్పొరేషన్ నుంచి యువజన నేతలు ఢిల్లీలోని జంతర్ మంతర్‌కు తరలివెళ్లారు. రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వంగ లక్ష్మీకాంత్‌రెడ్డి, బడంగ్‌పేట నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం అధ్యక్షుడు గుడుపల్లి పెంటారెడ్డి, మహేశ్వరం అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తదితరులు వెళ్లారు.

అభివృద్ధిపై కోటి ఆశలు

- ఆమనగల్లులో అనేక సమస్యలు తిష్ట
- పనులు చేపట్టాలని కోరుతున్న జనం
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపై ఆశలు
- డివిజన్ కార్యాలయాల ఏర్పాటుకు ఎదురుచూపులు



విస్తరణకు నోచుకోని ఆర్టీసీ బస్టాండ్

ఆమనగల్లు: నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న ఆమనగల్లు మండల అభివృద్ధి కోసం ప్రజలు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిపై కోటి ఆశలు పెట్టుకున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఇటీవల విజయం సాధించిన ఆయన ఆమనగల్లు అభివృద్ధి విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తారని జనం భావిస్తున్నారు. ఆమనగల్లులో అనేక సమస్యలు తిష్ట వేసుకొని ఉన్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఎమ్మెల్యేగా గెలిచిన అతనికి ఇక్కడి పరిస్థితులపై అవగాహన ఉంది. దీంతో అతను వాటిని పరిష్కరిస్తారని జనం నమ్ముతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం, పార్టీ నుంచే ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో సమస్యలు పరిష్కారమవుతాయని నియోజకవర్గంలో వినిపించే మాట. దీనికితోడు కల్వకుర్తి ప్రాంతానికి చెందిన ఎనుమల రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం కలిసొచ్చే అంశంగా అందరూ చెప్పుకుంటున్నారు.

నియోజక వర్గానికి కేంద్రబిందువు..

ఈ నియోజక వర్గానికి కేంద్రబిందువుగా ఆమనగల్లు ఉంది. దీంతో ఇక్కడ అనేక సమస్యలు తిష్ట వేసుకొని ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కసిరెడ్డి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

- ఆమనగల్లు పట్టణంలో మాడ్గుల రోడ్డులో ప్రారంభించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం భూ వివాదం కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయింది. భూ వివాదం పరిష్కరించి అదనంగా నిధులు మంజూరు చేయించి వచ్చే విద్యాసంవత్సరం నాటికి ఉపయోగంలోకి తీసుకరావాలి.
- ఇటీవల ఆమనగల్లు పట్టణానికి మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలకు భవనాలను నిర్మించడంతో పాటు వచ్చే విద్యాసంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేలా చూడాలని కోరుతున్నారు.
- స్థానిక పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని 150 పడకల ఆసుపత్రిగా వసతులు కల్పించి ప్రజలకు వైద్యసేవలు అందించేవిధంగా చర్యలు చేపట్టాలి.
- పట్టణంలో ఇరుకుగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌ను విస్తరించి ప్రయాణికులకు వసతులు కల్పించాలి.
- ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి. సబ్ రిజిస్ట్రార్, సబ్ ట్రెజరీ, ఆర్టీఓ, ఏసీపీ, అగ్నిమాపక కేంద్రం, మినీ స్టేడియం, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేయాలి.
- శిథిలావస్థకు చేరిన బాలుర బీసీ వసతిగృహాన్ని పునరుద్ధరించే చర్యలు తీసుకోవాలి. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్, సింగిల్‌విండో, మున్సిపల్, గిరిజన బాలుర వసతి గృహాలకు ప్రభుత్వ స్థలాలు కేటాయించి భవన నిర్మాణాలు చేపట్టాలి.



శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర వసతిగృహం



అసంపూర్తిగా జూనియర్ కళాశాల భవనం

- మండల పరిధిలోని వివిధ తండాలకు బీటీరోడ్డు నిర్మించాలి. జంగారెడ్డిపల్లి నుంచి చంద్రాయణపల్లి వరకు దెబ్బతిన్న బీటీరోడ్డుకు మరమ్మతులు జరిపించాలి.
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు. అలాగే కాలువ ద్వారా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలి.
- కొన్ని నెలల క్రితం శంఖుస్థాపన చేసిన బంజారా భవన నిర్మాణ పనులు ప్రారంభించాలి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను వెంటనే పూర్తిచేసి వినియోగంలోకి తేవాలి.
- నియోజకవర్గంలో ఆయా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవ చూపాలని ఆమనగల్లు ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడిపూజ



కడ్తాల్: అయ్యప్ప పడిపూజలో స్వాములు



శబరికి బయలుదేరిన అయ్యప్ప స్వాములు

కడ్తాల్: మండల కేంద్రంలోని శివాలయంలో అయ్యప్పస్వామి మహాపడి పూజ మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, గురుస్వాములు వెంకటేశ్, ప్రవీణ్, చంద్రయ్య, బాల్‌రాజ్, నవీన్, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

శబరిగిరికి తరలిన అయ్యప్ప స్వాములు..

మండల కేంద్రంలో అయ్యప్ప దీక్ష చేపట్టిన స్వాములు శబరిగిరికి బయలుదేరి వెళ్లారు. అంతకు ముందు ప్రత్యేక పూజల అనంతరం, గురుస్వామి చందర్‌నాయర్, ముకుంద గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడి కట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, శ్రీశైలం, వెంకటేశ్, బాల్‌రాజ్, గణేశ్‌గౌడ్, రాంచంద్రయ్య, శిశుపాల్ రెడ్డి, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

- ప్రార్థనా మందిర కబ్జాపై అధికారుల చర్యలు



అక్రమ కట్టడాన్ని కూల్చివేస్తున్న అధికారులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో ఇప్పటి వరకు ప్రభుత్వ భూముల కబ్జాలు కొనసాగుతుండగా.. తాజాగా ప్రైవేట్ స్థలాలకు కూడా రక్షణ లేకుండా పోతోంది. ఓ ప్రార్థనా మందిరానికి సంబంధించిన స్థలంలో రాత్రికి రాత్రే నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని అధికారులు మంగళవారం కూల్చివేశారు. అధికారుల వివరాల మేరకు.. జల్‌పల్లి గ్రామం పార్థివాడలోని 26, 27 సర్వే నంబర్లలో 2,025 గజాల స్థలాన్ని 1999లో సయ్యద్ అబ్దుల్ సమద్ ఖాద్రీ అనే వ్యక్తి పెద్ద గులాబ్ సింగ్, చిన్న గులాబ్ సింగ్, బాల్‌సింగ్, లక్ష్మతి, రామన్ బాబు, శేషారావు, రాంబాబుల నుంచి కొనుగోలు చేశారు. ఆ స్థలంలో బేస్‌మెంట్ నిర్మాణంతో పాటు ప్రార్థనా మందిరానికి సంబంధించిన స్థలమని సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. కొన్ని రోజులుగా ఓంకార్ మరికొందరితో కలిసి అక్కడే తిష్టవేసి చుట్టూ ప్రహరీ నిర్మించారు. రౌడీమూకలను స్థలంలో దించి యజమానులను బెదిరిస్తున్నారు. దీనిపై బాధిత కుటుంబ సభ్యులు పహాడీషరీఫ్ పోలీసులు, జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కమిషనర్ ఎస్.వసంత ఆదేశాలతో టీపీవో హబీబున్నీసా పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. అడ్డుకునేందుకు యత్నించిన వారిని పోలీసులు అక్కడి నుంచి పంపించి వేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజావాణిలో కార్పొరేటర్ శ్రీవాణి



అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ వార్డు కార్యాలయంలో మంగళవారం ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్థానిక కార్పొరేటర్ ఆకుల శ్రీవాణితో కలిసి ఏర్పాటు చేసిన ప్రజావాణికి విశేష స్పందన లభించింది. డివిజన్‌లో నెలకొన్న ప్రధాన సమస్యల గురించి ప్రస్తావించారు. రోడ్ల మరమ్మతులు, కుంగిన మ్యాన్‌హోల్స్, భూగర్భ డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం పనులు ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించిన సమస్యలపై ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. పెండింగ్ సమస్యల గురించి తెలుసుకుని వాటి పరిష్కార మార్గాలను చర్చించారని కార్పొరేటర్ వివరించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. వార్డు కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ కాలనీల ప్రతినిధులు శ్రీధర్‌రాజ్, మాధవరెడ్డి, హనుమంత్ రాయుడు, శ్రీరాములు, మోహనచారి, రాములు, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోండి

మహేశ్వరం: ఆటో కార్మికులకు నెలకు రూ.20 వేల జీవన భృతి కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన నేపథ్యంలో ఆటో నడిపే కార్మికుల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. ఆటోలో ఎక్కేవాళ్లే కరువయ్యారని కనీసం డీజిల్, పెట్రోల్ ఖర్చులు కూడా రావట్లేదన్నారు.

కసిరెడ్డికి అభినందనల వెల్లువ



మాడ్గుల: కసిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్నా మాడ్గుల ప్రజా ప్రతినిధులు



తలకొండపల్లి: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు, తదితరులు

మాడ్గుల: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కసిరెడ్డి నారాయణ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, నాయకులు కసిరెడ్డి నారాయణ రెడ్డికి పూల బొకే ఇచ్చి శాలువాకప్పి శుభాకాంక్షలు తెలిపారు. సూదిని కొండల్ రెడ్డి, బట్టు అశోక్ రెడ్డి, బొజ్జ సాయి రెడ్డి, లక్ష్మయ్య, యాదయ్య, వార్డు సభ్యులు రమేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాకప్పి సన్మానించారు. కార్యక్రమంలో మల్లేశ్, బోళ్ల యాదయ్య, శేఖర్, పోచయ్య, రవి, జంగయ్య, పాండు, తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తాం

ఆమనగల్లు: ప్రజా సమస్యల పరిష్కారానికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రజావాణి కార్యక్రమం చేపట్టారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల మండలాలకు చెందిన పలువురు నాయకులు, అధికారులు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి వివిధ శాఖల అధికారులతో నియోజకవర్గ అభివృద్ధి పనులపై సమీక్షించారు. కసిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హామీలన్నింటినీ అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, నాయకులు కొండల్‌రెడ్డి, మల్లేశ్, మల్లయ్య, యాదయ్య, సాయిరెడ్డి, అశోక్‌రెడ్డి, లక్ష్మయ్య, సంతోష, యాదయ్య, రమేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

యాచారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని యాచారం తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం యాచారం మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. జనవరి 5వ తేదీ వరకు బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి జనవరి 6న ముసాయిదా జాబితా ప్రకటిస్తామన్నారు. జనవరి 22వరకు అభ్యంతరాలు స్వీకరించి ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటిస్తామన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ సాగర్‌లు పాల్గొన్నారు.

సహకార సంఘాల సంక్షేమానికి కృషి

ఎంపీపటేల్‌గూడ పీఏసీఎస్ చైర్మర్ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ మహేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సహకార సంఘాల అభివృద్ధికి రైతులు కృషిచేయాలని ఎంపీపటేల్‌గూడ పీఏసీఎస్ చైర్మన్ మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపటేల్‌గూడ పీఏసీఎస్ పాలకవర్గం సమావేశం చైర్మన్ మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం ప్రస్తుతం రూ.55 లక్షల ఆదాయంతో నడుస్తుందన్నారు. బంగారు రుణాలపై గతంలో గ్రాముకు రూ.4వేలు ఉంటే ప్రస్తుతం మరో రూ.400 పెంచామన్నారు. పాలకవర్గం సమిష్టి నిర్ణయంతో ముందుకు పోతున్నామన్నారు. సంఘం సభ్యుల కోరిక మేరకు పెద్ద పెద్ద లాకర్లు ఏర్పాటు చేశామన్నారు. ఖాళీ స్థలంలో రూ.50 లక్షలతో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రుణాల వసూళ్లు సకాలంలో చేసి దీర్ఘ కాలిక రుణాలు రైతులకు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సామల రవీందర్‌రెడ్డి, డైరెక్టర్లు బాల్‌రెడ్డి, లింగారెడ్డి, యాదయ్యగౌడ్, మక్కపల్లి అంజయ్య, నిట్టు యాదమ్మ, తోట్ల యాదమ్మ, శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్‌లతో పాటు సీఈఓ మాధవి తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడానికి సహకరించండి

- రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్



కడ్తాల్: ఆర్థికసాయం అందజేస్తున్న దశరథ్‌నాయక్

కడ్తాల్: ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని రాధాకృష్ణ చారిటబుల్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందిన అంజమ్మ, తాహెరాబేగం, ప్రవీణ్ కుటుంబ సభ్యులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున మూడు కుటుంబాలకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్‌నాయక్ మాట్లాడుతూ మండల పరిధిలో పేదలకు ఏ ఆపద వచ్చిన సాధ్యమైనంత వరకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, వీరయ్య, గంప శ్రీను, లాయక్‌అలీ, పాండు, హర్యానాయక్, శ్రీను, అంజి, ఇర్షాద్, కృష్ణ, శ్రీకాంత్, శ్రీశైలం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో ప్రతిభను వెలికి తీయాలి

ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

ఆమనగల్లు: పోటీ పరీక్షలతో విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయొచ్చని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. విద్యార్థులు తరచూ పోటీ పరీక్షల్లో పాల్గొనాలని ఆయన సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీవాసవీ కళ్యాణ మండపంలో జ్ఞానవాహిని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం చూచిరాత పరీక్షలు నిర్వహించారు. పరీక్షలకు ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 425 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు పరీక్ష పత్రాలను సీఐ వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జ్ఞానవాహిని ఫౌండేషన్ నిర్వాహకులు పోటీ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మాజీ ఎంపీపీ తల్లోజు లలితమ్మ, ఎస్ఐ బాల్‌రాం, జ్ఞానవాహిని ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి రవీంద్రానంద్, సభ్యులు బికుమాండ్ల నర్సింహా, సత్యం, రంగారావ్, జగదీశ్, యాదగిరి, దినేశ్, తదితరులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 28న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల సంక్షేమానికి కృషి

- పీఆర్ ఏఈ ఇంద్రసేనారెడ్డి, పీఆర్టీయూ అధ్యక్షుడు పరమేశ్
- దేశ జాతీయ నాయకుల చిత్రపటాల అందజేత

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పాఠశాలల సంక్షేమానికి కృషి చేస్తామని మండల పీఆర్ ఏఈ ఇంద్రసేనారెడ్డి, పీఆర్టీయూ అధ్యక్షుడు పరమేశ్‌లు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఉన్నత బాలికల పాఠశాలలో దేశ జాతీయ నాయకుల చిత్రపటాలను వారు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము సంపాదించిన దాంట్లో కొంతైనా ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి కేటాయించి, విద్యార్థుల భవిష్యత్‌కు తోడ్పాటునందించేవిధంగా సహకరిస్తామన్నారు. ఈక్రమంలో విద్యార్థుల్లో జాతీయ స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను అలవర్చేందుకు దేశ భక్తుల చిత్రపటాలను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.



జాతీయ నేతల చిత్రపటాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు